
సాక్షి
ఒడిశా

బుధవారం । 23 । అక్టోబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,70,994లు, బంగారం 2గ్రాముల 50 మిల్లీగ్రాములు వెండి 51గ్రాముల 700 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



గంజాయి పట్టివేత

గజపతి జిల్లాలో 216 కిలోల గంజాయి పట్టుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేశారు.

- 8లో



బీజేడీ శ్రేణుల ధర్నా

గుసాని సమితిలో బీజేడీ శ్రేణులు ధర్నా చేశాయి. అవినీతి ఆరోపణలు చేశారు.

- 8లో

న్యూస్‌రీల్

రాష్ట్రపతి శ్రీమందిరం సందర్శన వాయిదా

భువనేశ్వర్: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్ర పర్యటన పురస్కరించుకుని పూరీ శ్రీమందిరం సందర్శన ఇటీవల ఖరారైన విషయం తెలిసిందే. అయితే దానా తుఫాన్ నేపథ్యంలో రాష్ట్రపతి శ్రీమందిరం దర్శనం వాయిదా పడినట్లు ఆలయ ప్రధాన పాలనాధికారి డాక్టర్ అరవింద కుమార్ పాఢి మంగళవారం తెలిపారు. దైనందిన కార్యకలాపాలు యథాతథంగా కొనసాగుతాయని స్పష్టం చేశారు.

విద్యాసంస్థలకు సెలవు

భువనేశ్వర్: దానా తుఫాన్ నేపథ్యంలో రాష్ట్రంలో విద్యా సంస్థలకు ఈ నెల 23 నుంచి 25 వరకు సెలవు ప్రకటించారు. తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉండే గంజాం, పూరీ, జగత్‌సింగ్‌పూర్, కేంద్రాపడా, భద్రక్, బాలాసోర్, మయూర్‌భంజ్, కెంజొహర్, ఢెంకనాల్, జాజ్‌పూర్, అంగుల్, ఖుర్దా, నయాగడ్, కటక్ జిల్లాల్లో పాఠశాలలు, కళాశాలలు, విశ్వ విద్యాలయాలకు మూడు రోజుల పాటు సెలవు ప్రకటిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ప్రత్యేక సహాయ కమిషనర్ ప్రకటించారు.

వైద్యుల గైర్హాజరుపై విచారణ



డాక్టర్ కుందును విచారిస్తున్న దృశ్యం

రాయగడ: పట్టణ పరిసర ప్రాంతాల్లోని గ్రామీణులకు మెరుగైన వైద్య సౌకర్యాలను అందించాలనే ఉద్దేశంతో స్థానిక యూజీఎం ఐటీ సమీపంలో ప్రభుత్వం అర్బన్ హెల్త్ సెంటర్ ఏర్పాటు చేసింది. అయితే ఆస్పత్రికి వైద్యుడు డాక్టర్ రోహిత్ కుండా సక్రమంగా హాజరవ్వకపోవడంతో జిల్లా వైద్య శాఖ దర్యాప్తుకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఏడీఎం (పబ్లిక్ హెల్త్) డాక్టర్ మమత చౌదరి, ఏడీఎం డాక్టర్ ప్రదీప్ సుబుద్ధిలు అర్బన్ ఆస్పత్రిలో సోమవారం దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తు పూర్తి చేసిన వైద్య బృందం ఈ మేరకు తమ నివేదికను జిల్లా ముఖ్యవైద్యాధికారికి సమర్పిస్తానని చెప్పారు.

రాజరిక శిథిలాలు పరిశీలన



పుదాఘడ్ ప్రాంతంలో పరిశీలిస్తున్న బృందం

కొరాపుట్: పురాతన పుదాఘడ్ రాజరిక శిథిలాలను అధికారులు మంగళవారం పరిశీలించారు. నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్‌కోట్ సమీపంలోని డోర్ద్ర జంక్షన్ నుంచి అటవీ ప్రాంతంలో ఉన్న ఈ రాజరిక ప్రాంతాన్ని కలెక్టర్ డాక్టర్ శుభంకర్ మహాపాత్రో, న్యూఢిల్లీ నుంచి వచ్చిన సర్వే ఆఫ్ ఇండియాకి చెందిన ఆంత్రోపాలజిస్ట్ డాక్టర్ పియూష్ రంజన్ సాహుల బృందం సందర్శించింది. 5వ శతాబ్దంలో నల వంశం పాలనకి చెందిన శిథిలాలపై పరిశోధన చేశారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు.

దొంగలకే దొంగలు



కొరాపుట్ పట్టణ పోలీసుల అదుపులో గంజాయి స్మగ్లర్లు, స్థానిక దొంగలు

కొరాపుట్: కొరాపుట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వింత జరిగింది. గంజాయి రవాణా చేయడానికి ఇద్దరు ప్రయత్నించగా.. స్థానిక దొంగలు వారి వద్దే నిలువు దోపిడీ చేసిన ఘటన చోటుచేసుకుంది. సోమవారం రాత్రి న్యూఢిల్లీకి చెందిన అల్తమాస్ మానో అనే యువతి, ఉత్తరప్రదేశ్‌కు చెందిన హేమసింగ్ మౌర్యలు గంజాయి రవాణా చేస్తూ రైలు ఎక్కడానికి కొరాపుట్ రైల్వేస్టేషన్‌కు వచ్చారు. అక్కడ రైలు లేకపోవడంతో సమీపంలోని ఆటోను మాట్లాడుకుని ఓ లాడ్జికి తీసుకెళ్లాలని కోరారు. అయితే వీరిద్దరూ స్థానికులు కాకపోవడంతో ఆ ఆటోడ్రైవర్ వారిని ఓ నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లాడు. అప్పటికే ఆ డ్రైవర్ మిత్రులు అక్కడకు చేరుకున్నారు. అంతా కలిసి వారిద్దరి దగ్గర నుంచి సెల్‌ఫోన్లు, నగదు దోచుకున్నారు. గంజాయిని మాత్రం తీసుకోలేదు. బాధితులిద్దరూ రోడ్డు మీద ఉండగా పోలీసులు చూశారు. అనుమానంతో తనిఖీలు చేయగా వీరి వద్ద 34 కిలోల గంజాయి దొరికింది. దీంతో వీరిద్దరినీ స్టేషన్‌కు వెళ్లి విచారించగా.. స్థానిక దొంగల విషయం బయటపడింది. వెంటనే పోలీసులు హౌసింగ్ కాలనీకి చెందిన మోహన్ నాగ్, బండి వీధికి చెందిన టికిరాం హరిజన్, రుపాంతర్ రథీలను అరెస్ట్ చేశారు.

తుఫాన్‌ను.. ఎదుర్కొందాం



తుఫాన్‌పై ఉన్నతాధికారుల సమీక్ష



సమీక్షలో పాల్గొన్న అధికారులు

భువనేశ్వర్:

దానా తుఫాన్ విపత్తును సమర్థం ఎదుర్కొనేందుకు యంత్రాంగం సన్నద్ధంగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా అధ్యక్షతన మంగళవారం ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రభుత్వ శాఖల ప్రముఖ కార్యదర్శులు పాల్గొన్నారు. దానా తుఫాన్ తీరం తాకిడి, తదనంతర తీవ్రత ఇతరేతర అంశాలపై లోతుగా సమీక్షించారు. తుఫాన్ తాకిడితో అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలతో శూన్య ప్రాణ హాని దృక్పథంతో సమగ్ర యంత్రాంగం కృషి చేయాలని కార్యదర్శి పిలుపునిచ్చారు. అలాగే తుఫాన్ తదనంతర పరిణామాల నేపథ్యంలో సత్వర పునరుద్ధరణ, మౌలిక సౌకర్యాల కల్పన వంటి కార్యకలాపాలు నిరాటంకంగా కొనసాగించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ప్రధానంగా విద్యుత్ సరఫరా, తాగు నీటి పంపిణీ, ఆరోగ్య సేవలు, రహదారుల పునరుద్ధరణ, పంటల సంరక్షణ వంటి ప్రధాన వైపరీత్య ప్రభావిత సమస్యల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తారు. అతి స్వల్ప నిడివిలో ప్రభావిత ప్రాంతాల్లో రోడ్లపై కూలిన చెట్ల తొలగింపు, విద్యుత్ ఇతరేతర స్తంభాల పునరుద్ధరణ, విద్యుత్ సరఫరా, తాగు నీటి పంపిణీ పునరుద్ధరణ వంటి కార్యకలాపాలు చేపట్టాలని కార్యదర్శులకు ఆదేశించారు. జనరేటర్లు వినియోగానికి ముందు పని తీరుని క్షుణ్ణంగా పరిశీలించి విపత్తు సమయంలో అక్కరకు వచ్చే రీతిలో సిద్ధం చేసుకుని అందుబాటులో ఉంచాలని తెలిపారు. బుధవారం నాటికి ఈ పనులు పూర్తి చేయాలని కాల పరిమితి నిర్ధారించారు.

అనుభవజ్ఞులకు ప్రత్యేక బాధ్యతలు

భువనేశ్వర్: దానా తుఫాన్ విపత్తు నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వం అనుభవజ్ఞులకు అప్పగించింది. తుఫాన్ తాకిడి ప్రాంతాల్లో విపత్తు నిర్వహణ, సహాయక, పునరుద్ధరణ, పునర్నిర్మాణ కార్యకలాపాల పర్యవేక్షణకు ఆరుగురు సీనియర్ ఐఏఎస్ అధికారుల్ని నియమించింది. రాష్ట్ర ప్రత్యేక సహాయ కమిషనరు ఈ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 23 బుధవారం నాటికి సంబంధిత ప్రాంతాలకు చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వీరంతా లోగడ ఆయా ప్రాంతాల్లో కలెక్టర్లు వంటి ఉన్నత స్థాయి కార్యకలాపాల్ని నిర్వహించిన వారు కావడం విశేషం. లఘు ఖనిజ విభాగం డైరెక్టరు కె.సుదర్శన చక్రవర్తిని బాలాసోర్, రెవెన్యూ-విపత్తు నిర్వహణ శాఖ అదనపు ప్రముఖ కార్యదర్శి త్రిలోచన్ మాఝిని భద్రక్, రాష్ట్ర పర్యాటక శాఖ కమిషనరు-కార్యదర్శి బల్వంత్ సింగ్‌ని పూరీ, తాగునీరు, పారిశుద్ధ్య శాఖ డైరెక్టరు, అదనపు కార్యదర్శి వినీత్ భరద్వాజ్‌ని మయూర్‌భంజ్, ఒడిశా ఆదర్శ విద్యాలయ్ ఓఏవీ ప్రముఖ అధికారి యామిని షడంగిని జగత్‌సింగ్‌పూర్, పర్యాటక శాఖ డైరెక్టరు సమర్థ వర్మని కేంద్రాపడా ప్రాంతాలకు కేటాయించారు.

ప్రభావిత ప్రాంతాలకు సహాయక బృందాల తరలింపు

భువనేశ్వర్: తుఫాన్ సన్నద్ధతలో భాగంగా ప్రభావిత ప్రాంతాలకు సహాయక బృందాల్ని తరలిస్తున్నారు. మంగళ వారం నుంచి ఈ ప్రక్రియ మొదలైంది. తొలి విడతలో జాతీయ విపత్తు స్పందన దళం 20 యూనిట్లని తరలించేందుకు రంగం సిద్ధం చేసింది. దీనిలో భాగంగా మంగళవారం 10 యూనిట్లని పలు ప్రాంతాలకు చేరవేసింది. మరో 10 యూనిట్ల ఎన్‌డీఆర్‌ఎఫ్ జవాన్లని కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి అభ్యర్థించింది. తొలి విడత కింద తరలించిన ఎన్డీఆర్ దళాలు పూరీ, మయూర్‌భంజ్ జిల్లాలకు ఒక్కో యూనిట్, భద్రక్, బాలాసోర్, జగత్‌సింగ్‌పూర్, కేంద్రాపడా జిల్లాలకు ఈ చొప్పున ఎన్డీఆర్‌ఎఫ్ దళాల్ని తరలించారు.

రైల్వే శాఖ అప్రమత్తం

ప్రయాణికుల సురక్షిత ప్రయాణం లక్ష్యంగా

భువనేశ్వర్: తుఫాన్ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని తూర్పు కోస్తా రైల్వే ఖుర్దారోడ్ మండల రైల్వే అధికారి డీఆర్‌ఎం హెచ్. ఎస్. బాజ్వా తోటి అధికారులు, సిబ్బందికి పిలుపునిచ్చారు. విపత్తు నిర్వహణ కోసం మానవ వనరులతో పుష్కలమైన సాంకేతిక, యాంత్రిక వ్యవస్థని ప్రభావిత ప్రాంతాల్లో అందుబాటులో ఉంచాలని అధికారులకు ఆదేశించారు. తుఫాన్ తాకిడి, ప్రభావం నేపథ్యంలో రైళ్ల రవాణా సర్దుబాటు చేస్తున్నారు. కొన్ని రైలు సేవల్ని పూర్తిగా రద్దు చేయగా మరికొన్నింటి సేవల్ని పాక్షికంగా రద్దు చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ప్రయాణికులకు సంబంధిత మొబైలు ఫోను నంబర్లకు రైళ్ల రద్దు సమాచారం అందుతుందన్నారు. వాతావరణ మార్పులు, తీవ్రత ఆధారంగా రైళ్ల రవాణా నియంత్రణ అనుక్షణం మార్పు చేర్పులకు అనుగుణంగా కొనసాగుతుందని తెలిపారు.

సత్వర సమాచారం

తుఫాన్ కారణంగా మార్గ మధ్యంలో ఉన్న ప్రయాణికుల సమాచారం అందజేసేందుకు, రైళ్ల కదలిక తాజా సమాచారం కోసం మండల స్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. బుధవారం నుంచి ఈ వ్యవస్థ పని చేస్తుంది.

ప్రభావిత స్టేషన్లు

ఖుర్దారోడ్ మండలంలో భద్రక్, జాజ్‌పూర్-కెంజొహర్ రోడ్, జఖపురా, పారాదీప్, కటక్, భువనేశ్వర్, ఖుర్దారోడ్, పూరీ పరిసర రైల్వే స్టేషన్లపై దానా తుఫాన్ తాకిడి ప్రభావం ఉంటుందనే అంచనాతో ముందస్తు విపత్తు నిర్వహణ సరంజామాతో యంత్రాంగం సిద్ధం అయిందని డీఆర్‌ఎం వివరించారు. ఈ నేపథ్యంలో ఖుర్దారోడ్ రైల్వే మండలం నుంచి ప్రారంభం అయ్యే రైలు, మండలం గుండా ఉభయ దిశల్లో రవాణా అయ్యే పలు ప్రయాణికుల రైలు సేవల్ని రద్దు చేసినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన తొలి జాబితాలో 178 దూర ప్రాంతపు ప్రయాణికుల రైళ్లు ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు ఈ పరిస్థితి కొనసాగుతుంది. రైళ్ల రాకపోకల తాజా సమాచారం తరచు సంబంధిత ప్రయాణికులు, వినియోగదారులకు తెలియజేస్తారు. రైళ్ల రద్దు పురస్కరించుకుని రిజర్వేషను ఫిరాయింపు వ్యవస్థని సరళీకరిస్తారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

● పరిస్థితి విషమం



బొలేరో వాహనం



గాయపడిన గోవింద జొడియా



నుజ్జునుజ్జయిన బైకు

రాయగడ: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. రాయగడ జిల్లాలోని కాసీపూర్ సమితి అంద్రాకంచ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నారింగిపాడి కూడలిలో బైకు, బొలేరో వాహనం ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఇద్దరు గాయాలపాలయ్యారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను టికిరి ఆస్పత్రికి తరలించారు. అయితే వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కొరాపుట్‌కు ఆస్పత్రికి రిఫర్ చేశారు. అంద్రాకంచ్ పోలీస్ స్టేషన్ ఐఐసీ అశ్విని కుమార్ పట్నాయక్ తెలియజేసిన వివరాల ప్రకారం.. సోమవారం సాయంత్రం కుడిపాదోరా గ్రామానికి చెందిన గోవింద జొడియా, కేశవ్ జొడియాలు బైకుపై డొంగాశిలి వస్తుండగా ఎదరుగా వస్తున్న బొలేరొను అదుపుతప్పి ఢీకొన్నారు. దీంతో వారిద్దరూ తీవ్రగాయాలకు గురయ్యారు. బైకు నుజ్జునుజ్జవ్వగా బొలేరో ముందు భాగం కూడా దెబ్బతింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పడవ మునక

భువనేశ్వర్: బైతరణి నదిలో చేపల వేట పడవ మునిగింది. ఈ పడవలో 10 మందికి పైగా మత్స్యకారులు ఉన్నారు. వీరంతా దిఘా ప్రాంతీయులు. ధామ్రా ఓడ రేవు ధమరాయి అమ్మవారి ఆలయం తీరంలో ఈ పడవ మునిగింది. అదృష్టవశాతు పడవలోని మత్స్యకారులందర్ని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు.

యువకుడు దుర్మరణం



సమీర్ మృతదేహం



నుజ్జునుజ్జయిన బైకు

రాయగడ: రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. ఈ సంఘటన జిల్లాలోని తెరువలి పోలీస్‌స్టేషన్ పరిధి పాయికొపాపడ సమీపంలోని కొయిబొందో మలుపు వద్ద మంగళవారం ఉదయం చోటు చేసుకోగా.. సమీర్ ప్రస్కా(37) ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. తెరువలి మీదుగా బైకుపై వస్తున్న సమీర్ కొయిబొందో మలుపులో ఎదురుగా వస్తున్న బొలేరో వాహనాన్ని బలంగా ముందునుంచి ఢీకొన్నాడు. దీంతో పైకెగిరి కింద పడిపోవడంతో తీవ్రగాయాలకు గురై సంఘటన స్థలం వద్దే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం తెలుసుకున్న సమీర్ కుటుంబీకులు, బంధువులు సంఘటన స్థలం వద్ద ఆందోళనకు దిగారు. పోలీసులు వెళ్లి వారిని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. మృతుని కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బొలేరో వాహన డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

అలుగు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న అలుగు

రాయగడ: జిల్లాలోని గుడారి అటవీ శాఖ అధికారులు ఒక అలుగును మంగళవారం ఉదయం స్వాధీనం చేసుకున్నారు. గుడారి అటవీ రేంజ్ పరిధిలోని సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో రంగామటి గ్రామం సమీపంలోని పంటపొలం నుంచి అలుగు రోడ్డు మీదకు రావడాన్ని గుర్తించారు. వెంటనే దానిని పట్టుకుని కార్యాలయానికి తీసుకువెళ్లారు. అనంతరం దానిని పశుచికిత్సాలయానికి తీసుకువెళ్లి వైద్యం చేయించారు. ఏసీఎఫ్ ప్రదీప్ వృష్టి, రేంజర్ దిలీప్ కుమార్ పట్నాయక్ తదితరులు అటవీ ప్రాంతంలో అలుగును విడిచిపెట్టారు.

ఆటో బోల్తా: బాలిక మృతి

● ఐదుగురికి గాయాలు



తులసి మృతదేహం

రాయగడ: ఆటో బోల్తా పడిన ఘటనలో బాలిక మృతి చెందగా మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. జిల్లాలోని మునిగుడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుండిహింబ గ్రామంలో సోమవారం సాయంత్రం చోటు చేసుకున్న ఈ ప్రమాదంలో తులసి కౌసల్య (15) ప్రాణాలు కోల్పోయింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను మునిగుడ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కౌసల్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. మునిగుడ ఐఐసీ సౌదామిని బెహర తెలియజేసిన వివరాల ప్రకారం .. పిస్కాపొంగ గ్రామానికి చెందిన 12 మంది ఒక ఆటోలో కుముడాబలిలోని శివమందిరానికి వెళ్లారు. దర్శనం చేసుకున్న అనంతరం తిరిగి ఆటోలో స్వగ్రామానికి వస్తుండగా సుండిహింబ సమీపంలో ఆటో బోల్తా పడడంతో ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసి ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

చెట్టును ఢీకొన్న కారు

● ఒకరి మృతి



చెట్టును ఢీకొన్న కారు

మల్కన్‌గిరి: చెట్టును కారు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. జిల్లాలోని చిత్రకొండ సమితి రాజులకొండ గ్రామ సమీపంలో మంగళవారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి మృతి చెందిన వ్యక్తి ఆంధ్ర సరిహద్దు కొత్తగూడేం ముర్లగెడ్డ గ్రామానికి చెందిన రాసాఖిలో(15)గా గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే.. చిత్రకొండ సమితి సరిహద్దు ఆంధ్రప్రదేశ్ కొత్తగూడేం మండలం ముర్లగెడ్డ గ్రామానికి చెందిన ప్రకాష్ ఖిలో అతని ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కొడుకులతో పాటు ఒక కారులో ఆంధ్రప్రదేశ్ నర్సీపట్నంలో ఆశ్రమ పాఠశాలలో వదలడానికి బయల్దేరారు. ఈ క్రమంలో చిత్రకొండ మీదుగా వెళ్తున్న సమయంలో కారు అదుపుతప్పి ఒక చెట్టుకు ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రకాష్ ఖిలో పెద్ద కూతురు మృతి చెందగా అతని కొడుకు శ్రీను, రాముడు, చిన్న కుమార్తె ఎలిసాకు స్వల్పగాయాలు తగిలాయి. ఈ ప్రమాదం జరిగిన వెంటనే అక్కడ ఉన్నవారిని వెంటనే ఆస్పత్రికి తరలించారు.

ఇద్దరు మహిళల బలవన్మరణం

● వీరిలో ఒకరికి ఆరు నెలల క్రితమే వివాహం



దూలానికి వేలాడుతున్న నెందే బాట



భర్త అశోక్‌తో కరుణ దాస్ (ఫైల్)



ఉరివేసుకున్న కరుణ దాస్

మల్కన్‌గిరి: ఇద్దరు వివాహితలు బలవన్మరణానికి పాల్పడ్డారు. పొడియా సమితి పరిధిలో ఒకరు, కలిమెల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎం.వి.70 గ్రామంలో మరొకరు ఉరివేసుకొని ప్రాణాలు తీసుకున్నారు. వీరిలో ఒకరికి ఆరు నెలల క్రితమే వివాహమైంది. వివరాల్లోకి వెళితే.. మల్కన్‌గిరి జిల్లా పొడియా సమితి కేంద్రానికి చెందిన నెందే బాట (22)కు సింగ బాట అనే యువకుడితో ఆరు నెలల క్రితం వివాహమైంది. అయితే ఏమైందో తెలియదుగాని సోమవారం రాత్రి అందరితో కలిసి భోజనాలు చేసిన తరువాత పడుకున్నారు. అర్ధరాత్రి తరువాత నెందే బాట ఎవరూ లేని వేరే గదిలోకి వెళ్లి దూలానికి తాడుతో ఉరివేసుకొని ప్రాణాలు తీసుకుంది. మంగళవారం ఉదయం లేచి ఏవరి పనిలో వారు ఉండగా భర్త సింగ బాటకు భార్య కనిపించకపోవడంతో ఇంట్లో వేతికాడు. చివరికి ఓ గది తలుపు వేసి ఉండటంతో అనుమానంతో బలవంతంగా వాటిని తెరిసి చూసేసరికి దూలానికి వేలాడుతూ నెందే బాట వేలాడుతూ చనిపోయి కనిపించడంతో కన్నీరుమున్నీరయ్యారు. భార్య చనిపోయినట్టు పొడియా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాధు చేశాడు. సంఘటనా స్థలాన్ని సందర్శించిన పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని కలిమెల ఆరోగ్య కేంద్రానికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

కలిమెల పోలీసుస్టేషన్ పరిధిలో..

కలిమెల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎం.వి.70 గ్రామంలో కరుణ దాస్ (22) అనే వివాహిత ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని ప్రాణాలు తీసుకుంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ అఘాయిత్యానికి ఒడిగట్టింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలంకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అశోక్ దాస్‌తో కరుణ దాస్‌కు కొన్నేళ్ల క్రితం వివాహమైంది. అయితే ఈ దారుణానికి ఎందుకు ఒడిగట్టిందనే విషయం తెలియరాలేదు. హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

పర్యావరణపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

రాయగడ: పర్యావరణ పరిరక్షణకు ఎంతగాతో దోహదపడే మొక్కల పెంపకంపై అవగాహన కల్పించేందుకు సామాజిక కార్యకర్త దయానిధి ఖడంగ నడుం బిగించారు. ఇందులో భాగంగా స్థానిక సాయిప్రియనగర్‌లోని ఎస్.వి.ఆర్.పాఠశాల విద్యార్థులతో కలిసి పర్యావరణ, మొక్కల సంరక్షణపై చైతన్య ర్యాలీని మంగళవారం నిర్వహించారు. ర్యాలీలో పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కనకదుర్గ, విద్యార్థులు పాల్గొన్నారు.

టాపర్లకు సత్కారం



తన నియోజకవర్గానికి చెందిన టాపర్లకు మిఠాయి తినిపిస్తున్న సాంఘిక సంక్షేమ మంత్రి నిత్యానంద గొండో

కొరాపుట్: ఒడిశా అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ ఎగ్జామినేషన్స్‌లో టాపర్లుగా నిలిచిన తన నియోజకవర్గానికి చెందిన వారిని రాష్ట్ర సాంఘిక సంక్షేమ, విద్యా శాఖ మంత్రి నిత్యానంద గొండో సత్కరించారు. భువనేశ్వర్‌లోని తన చాంబర్‌లో మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్‌కోట్ లోని రాయిఘర్‌కి చెందిన మధుస్మిత గొండో, గీతాంజలి గొండోలకు మంత్రి మిఠాయి తినిపించి, పూలబొకేలను ఇచ్చి సత్కరించారు. గిరిజన తెగ నుంచి ఇద్దరు మహిళలు సాధించిన విజయం అందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు.

'స్థానిక ఉద్యోగాలకు' మద్దతు



పాఠశాల ప్రధాన ఉపాధ్యాయునికి వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

జయపురం: జిల్లా పరిధిలో ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలన్న డిమాండ్‌తో జరుగుతున్న ఆందోళనకు మద్దతుగా కొట్‌పాడ్‌లో వినూత్న కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాలలకు విద్యార్థులకు పంపించకుండా నిరసన తెలుపుతున్నారు. పది పంచాయతీల్లోని బడులు పిల్లలు లేక వెలవెలబోతున్నాయి. ఇతర జిల్లాల ఉపాధ్యాయులు ఇక్కడ పనిచేస్తున్నారని, జిల్లా పరిధి ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. పిల్లలు రాకపోవడంతో ఉపాధ్యాయులు వచ్చి వెనుదిరుగుతున్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పర్లాకిమిడి: ఒడిశా ప్రకృతి వైపరీత్యాల నివారణ దినోత్సవం, అవినీతి నివారణ వారోత్సవాలు సందర్భంగా స్థానిక మహారాజా బాలుర ఉన్నత పాఠశాలలో చిత్రలేఖనం, వక్తృత్వ, ప్రబంధాలు పోటీలు ఉన్నత విద్యాలయాలు, కళాశాల స్థాయిలో అధికారులు మంగళవారం నిర్వహించారు. ఈ పోటీల్లో అనేక మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా బిచిత్రా నంద బెబర్తా, భాగవత్ పాఢి, తమరాపు దేవదాసు, డి.శ్రీరాంమూర్తి, సస్మితా మిశ్రా, సులతా శుభదర్శినీ, జగన్నాథ పట్నాయిక్, పద్మినీ పండా,కిశోర్ దాస్ తదితరులు వ్యవహరించారు. విజేతలకు ఈనెల 29న బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందన్నారు.

ఐపీఎల్ సెలక్షన్ ట్రయల్స్‌కు ప్రసాద్



శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాకు చెందిన సింగుపురం దుర్గ నాగ వరప్రసాద్ ఐపీఎల్ అవకాశానికి చేరవయ్యాడు. బెంగళూరు వేదికగా ఈ నెల 17 నుంచి జరుగుతున్న అంతర్‌రాష్ట్ర అండర్–25 పి.రామచంద్రరావు ట్రోఫీలో ఆంధ్రా జట్టు తరఫున రాణిస్తున్న ఎస్‌డీఎస్‌వి ప్రసాద్‌కు ఐపీఎల్ కింగ్స్ లెవన్ పంజాబ్ నుంచి సెలక్షన్ ట్రయల్స్‌కు హాజరుకావాలని పిలుపొచ్చింది. జలుమూరుకు చెందిన ఈ కుర్రాడు వికెట్ కీపర్ కమ్ బ్యాటర్‌గా ఇటీవలి కాలంలో మెరుగ్గా రాణిస్తున్న సంగతి తెలిసిందే.

హిమాచల్‌లో కేసీసీ బ్యాంక్ బృందం పర్యటన



హిమాచల్‌ప్రదేశ్ కోఆపరేటివ్ బ్యాంక్ ప్రతినిధులతో కేసీసీ బ్యాంక్ ప్రతినిధులు



హిమాచల్‌ప్రదేశ్‌లో పర్యటిస్తున్న కేసీసీ బృందం

కొరాపుట్: హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలో కొరాపుట్ సెంట్రల్ కో ఆపరేటివ్ బ్యాంక్ బృందం పర్యటించింది. మంగళవారం ఆ రాష్ట్ర రాజధాని సిమ్లాలో హిమాచల్‌ప్రదేశ్ కో ఆపరేటివ్ బ్యాంక్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించింది. ఆ బ్యాంక్ దేశంలోనే అభివృద్ధి చెందిన సహకార బ్యాంకుల్లో 3వ స్థానంలో ఉంది. సుమారు 200 శాఖలతో రూ.25 వేల కోట్ల వార్షిక టర్నోవర్ కలిగి ఉంది. ఆ బ్యాంక్ అమలు చేస్తున్న పథకాలు అధ్యయనం చేయడానికి బృందం వెళ్లింది. అక్కడి పథకాలు కొరాపుట్ జిల్లాల్లో అమలు చేయడానికి సాధ్యాసాధ్యాలను పరిశీలించింది. ఈ బృందంలో కేసీసీ బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర్‌చంద్ర పాణిగ్రాహీ, 13 మంది డైరెక్టర్లు ఉన్నారు.

216 కిలోల గంజాయి పట్టివేత



గంజాయి రవాణా చేస్తు పట్టుబడిన నిందితులు



నువాగడ బ్లాక్ పనసపదర చౌక్ వద్ద పట్టుబడిన గంజాయి బస్తాలతో నిందితులు

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో ఆర్.ఉదయగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో 216 కిలోల గంజాయిని పట్టుకున్నారు. నువాగడ బ్లాక్ పనసపదర చౌక్ మీదుగా గంజాయి రవాణా అవుతుందన్న సమాచారం మేరకు ఆర్.ఉదయగిరి ఎస్ఐ సందీప్ హేంబ్రం, స్వప్నరాణి బెహరా ఒక రెడ్ మారుతీ సుజుకీ కారును ఆపి తనిఖీలు చేపట్టి ఇద్దరు నిందితులను పట్టుకున్నారని ఎస్పీ జితేంద్ర నాథ్ పండా తెలిపారు. రాణిపేట డీపీఓ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం నిందితులను ఎస్పీ సమక్షంలో హాజరుపరిచారు.

నువాగడ బ్లాక్ పరిమళ – ఎన్.జాలార్ సింగి రోడ్డు పనసపదర వద్ద దొరికిన కారులో ఏడు సంచుల్లో గంజాయి బస్తాలు ఉన్నాయి. వీటిని నువాగడ తహసీల్దార్ డాక్టర్ మోనాలిసా ఆచార్జీ తూనిక వేయించారు. పట్టుబడిన గంజాయి 216.5 కిలోలు ఉన్నట్టు ఎస్పీ జితేంద్రనాథ్ పండా తెలిపారు. ఇద్దరు దొరకగా మరొకరు పారిపోయారని చెప్పారు. నిందితులు రాయగడ జిల్లా పద్మపూర్ గ్రామానికి చెందిన ప్రసాద్ గంట (25), గజపతి జిల్లా ఆర్.ఉదయగిరి బ్లాక్ అనుగురు పంచాయితీ అత్తిలిమ్మా గ్రామానికి చెందిన రాను బనియా(19) అని తెలియజేశారు.

దోపిడీ కేసులో ముగ్గురు అరెస్టు



పోలీసులకు చిక్కిన నిందితులు

రాయగడ: దోపిడీ కేసుకు సంబంధించి అంబొదల పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో మునిగుడ సమితి గొటిగుడ గ్రామానికి చెందిన లక్ష్మణ్ పిలక, దుఖిలిమ్మ గ్రామానికి చెందిన రంజన్ బాగ్, మునిగుడకు చెందిన సబర్ సరకలు ఉన్నారు. దీనికి సంబంధించి పోలీసులు మంగళవారం వివరాలు వెల్లడించారు. అంబొదల పోలీస్ స్టేషన్ పరిధిలోని అసురుపడ గ్రామానికి చెందిన వృద్ధురాలు జిమిలి జకసిక ఈ నెల 20వ తేదీన ఇంటి నుంచి ఉదయం పది గంటల సమయంలో బటిలిమ్మ గ్రామానికి నడుచుకుంటూ వెళ్తుండగా మార్గమధ్యలో ముగ్గురు గుర్తు తెలియని దుండగులు ఆమెను అడ్డగించి చెవి దిద్దులు, ముక్కుపుడకను తెంపుకొని పరారయ్యారు. ఈ మేరకు ఆమె మునిగుడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేసి నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. వారివద్ద నుంచి రెండు చెవి దిద్దులు, రెండు ముక్కు పుడకలు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు చెప్పారు.

లబ్ధిదారులకు ఇంటి పట్టాలు పంపిణీ



లబ్ధిదారులకు పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే, సబ్‌కలెక్టర్

జయపురం: వసుందర పథకంలో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు అధికారులు మంగళవారం పట్టాలు అందజేశారు. జయపురం సమితి బరిణిపుట్ పంచాయతీ ముండిగుడ గ్రామంలో జయపురం తహసీల్దార్ ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి, గౌరవ అతిథిగా జయపురం సబ్‌కలెక్టర్ అక్కవరం శొశ్వా రెడ్డి పాల్గొన్నారు. వారు ముండిగుడలో 49 మంది లబ్ధిదారులకు నాలుగు సెంట్ల చొప్పున ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ప్రభుత్వం అందజేస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకొని ఇళ్లు కట్టుకోవాలని ఎమ్మెల్యే బాహిణీపతి లబ్ధిదారులకు విజ్ఞప్తి చేశారు. తహసీల్దార్ సబ్యసాచి జెన అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రెవెన్యూ సూపర్‌వైజర్ హరి హర శతపతి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సూరజ్ పండ, దిలీప్ కుమార్ ప్రధాన్, సస్మిత రౌళో పాల్గొన్నారు.

పూజా తోరణాల తొలగింపునకు ఆదేశాలు



ఢెంకనాల్‌లో గజ లక్ష్మీ పూజా పందిరి తోరణం

భువనేశ్వర్: దానా తుఫాన్ ప్రభావం గజలక్ష్మి పూజలపై పడింది. ఢెంకనాల్ ఈ పూజల నిర్వహణకు ప్రసిద్ధి. పట్టణంలో పలు చోట్ల భారీ పందిళ్లు వేశారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ఈ పందిళ్లని ముందస్తుగా తొలగించాలని పూజా కమిటీ వర్గాలకు మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. బుధవారం నాటికి పట్టణ వ్యాప్తంగా ఏర్పాటు చేసిన గజ లక్ష్మీ పూజా పందిళ్లు తొలగించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పూజా పందిళ్ల నిర్వహణ ఇతరేతర కార్యకలాపాలు పురస్కరించుకుని ఇతర ప్రాంతాల నుంచి విచ్చేసిన స్థానికేతరులు త్వరగా స్వస్థలాలకు బయల్దేరాలని ఆదేశించారు.

గర్భిణిపై పోలీసుల అనుచిత ప్రవర్తనపై ఫిర్యాదు

రాయగడ:

ఒక గర్భిణిపై పోలీసులు అనుచితంగా వ్యవహరించారని, వారిపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు మంగళవారం ఎస్పీ స్వాతి ఎస్.కుమార్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లా పోలీసు కార్యాలయానికి వెళ్లి ఆమె ఈ ఫిర్యాదు చేశారు. ఈ నెల 17న స్థానిక బ్రాహ్మణ వీధిలో పోలీసులు పేకాట స్థావరాలపై దాడులు చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు ఆ వీధికి చెందిన శ్రావణి కుమారి జెన్న అనే గర్భిణి ఇంటిలో జొరబడి ఆమెపై అనుచితంగా ప్రవర్తించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. రాయగడ ఐఐసి కేకేబీకే కుహోరా, కానిస్టేబుల్ బిజయ్ కుమార్ సాహు, బిజయ్ కుమార్ జెన్నలపై బాధితురాలు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఎస్పీని కలిసి తిరిగి వస్తుండగా ఆమె కళ్లు తిరిగి పడిపోయారు. దీంతో ఆమెను ఆస్పత్రికి తరలించారు.



ఎస్పీ కార్యాలయంలో అస్వస్థతకు గురై కింద పడిపోయిన గర్భిణి జెన్న


సహాయక చర్యల్లో ఎమ్మెల్యేలు పాల్గొనాలి

• ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

భువనేశ్వర్: దానా తుఫాన్ రాష్ట్రంలోని పలు కోస్తా ప్రాంతాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. దీంతో ఆయా ప్రాంతాల నియోజకవర్గాల శాసన సభ్యులు ఆపత్కాలంలో ప్రజలకు అందుబాటులో ఉండాలని రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఆదేశించారు. ఆపత్కాలంలో ఎమ్మెల్యేలు తప్పకుండా అందుబాటులో ఉండాలన్నారు. తుఫాన్ సమయంలో ప్రజలకు అండగా నిలిచి తదనంతర సహాయక, పునరుద్ధరణ కార్యకలాపాల్లో చురుకుగా పాలుపంచుకోవాలని ఆదేశించారు. ఈ నెల 24 రాత్రి లేదా 25 ఉదయం దానా తుఫాన్ తీరం దాటే అవకాశం ఉంది. ప్రభావిత ప్రాంతాల నుంచి ఆశ్రయ శిబిరాలకు ప్రజల్ని తరలిస్తారు. ఈ ప్రక్రియ బుధ వారం నాటికి పూర్తి చేయాలన్నారు. ఆశ్రయ కేంద్రాల్లో తలదాచుకున్న వారందరికి వండిన ఆహార పదార్థాల పంపిణీ చేసేందుకు ఆదేశించారు. ఈ మేరకు ఆశ్రయ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తయినట్లు ముఖ్యమంత్రి అభయం ఇచ్చారు. భారత వాతావరణ శాఖ సమాచారం ప్రకారం పారాదీప్ తీరానికి 690 కిలో మీటర్లు, పశ్చిమ బెంగాల్ సాగర ద్వీపానికి 740 కిలో మీటర్లు, బంగ్లాదేశ్ ఖెపుపడాకు 710 కిలోమీటర్ల దూరంలో తుఫాన్ కేంద్రీకృతమై ఉంది.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త

• విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జెట్టి



నరసన్నపేట పోలీసు స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటుతున్న డీఐజీ గోపీనాథ్ జెట్టి

శ్రీకాకుళం క్రైమ్ : సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపినాథ్ జెట్టి ప్రజలకు సూచించారు. మంగళవారం జిల్లాకు విచ్చేసిన ఆయన కొన్ని సూచనలు చేశారు. ట్రాయ్ (టీఆర్ఏఐ)లో పనిచేస్తున్నామని, మీ మొబైల్ నెంబర్ అక్రమ కార్యకలాపాలకు సంబంధించినదని, సేవలు నిలిపివేస్తామని బెదిరిస్తారని వాటిని నమ్మవద్దన్నారు. కస్టమ్స్‌లో పనిచేస్తున్నామని, మీకొచ్చిన పార్సిల్‌లో అక్రమ పదార్థాలు, చెల్లింపు చేయాలని డిమాండ్ చేస్తారని. వాటిని పట్టించుకోవద్దన్నారు. మీ బంధువును అరెస్టు చేస్తారని చెప్పి డబ్బులు చెల్లించమని డిమాండ్ చేస్తారని, సోషల్ మీడియాలో పెట్టుబడులపై ఎక్కువ లాభాలొస్తాయని ప్రకటనలు గుప్పిస్తారని, క్రెడిట్ కార్డు పేరిట మోసాలకు పాల్పడుతుంటారని, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. సైబర్ మోసాల బారిన పడితే తక్షణమే టోల్‌ఫ్రీ నంబరు1930ను గానీ, నేషనల్ కస్టమర్ హెల్ప్‌లైన్ (1800–11–4000) డయల్ చేయవచ్చని పేర్కొన్నారు.సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో కూడా ఫిర్యాదు నమోదు చేసుకోవచ్చని, పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి ఎఫ్ఐఆర్ నమోదు అయ్యేలా చూసుకోవాలని సూచించారు.

నరసన్నపేట: సర్కిల్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేయాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి అన్నారు. నరసన్నపేట పోలీసు స్టేషన్‌తో పాటు సర్కిల్ కార్యాలయాన్ని ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సైబర్ క్రైమ్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని, అప్రమత్తంగా ఉండాలన్నారు. అంతకు ముందు స్థానిక సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్‌తో పాటు సిబ్బందికి పలు సూచనలు చేశారు. రికార్డులను పరిశీలించారు. స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. శాంతి భద్రతల అదుపులో రాజీ పడవద్దని అన్నారు.

మెరిసిన గజపతి విద్యార్థులు



దేబాబ్రత గాడో



అద్యాస రాతో



బోదాలు రాణి



సామి రంజన్ భుయ్యాన్



జాన్ బోదోభుయ్యాన్



కళింగ కుమార్ పూజారీ



సోమనాథ్ శోబోరో

పర్లాకిమిడి: ఒడిశా సివిల్ ఫలితాల్లో గజపతి జిల్లాకు చెందిన ఎనిమిది మంది యువతీ యువకులు విజయం సాధించారు. వీరిలో రాయఘడ బ్లాక్ జిరంగో గ్రామానికి చెందిన దేబబ్రత గాడోకు 7వ ర్యాంకు, గజపతి జిల్లా కలెక్టరేట్‌లో ఏడీడబ్ల్యూఓ పనిచేస్తున్న అల్యాస రౌత్‌కు 99వ ర్యాంకు లభించింది. అలాగే గుసాని సమితి బాగుసల గ్రామం రైతు కుటుంబానికి చెందిన సింగిపురం హరికి 42 ర్యాంకు లభించగా, పర్లాకిమిడి కేవుటి వీధికి చెందిన బోదాలు రాణికి 336వ ర్యాంకు దక్కింది. రాయఘడ బ్లాక్ డోంబాలో గ్రామపంచాయితీ ఉకార్‌సింగి గ్రామానికి చెందిన సామి రంజన్ భుయ్యాన్, రాయఘడ బ్లాక్ లైలై పంచాయితీ రేగం గ్రామానికి చెందిన జాన్ బడ భుయ్యాన్‌కు 561 ర్యాంకు, గుమ్మా బ్లాక్ తుమ్ముల గ్రామానికి చెందిన సోమనాథ్ శోబోరో 569, ఆర్.ఉదయగిరి బ్లాక్ ఛెలిగడ పంచాయితీ గద్దర్ గ్రామానికి చెందిన కళింగ కుమార్ పూజారీ ఓ.ఏ.ఎస్.లో విజయం సాధించారు. వీరు సాధించిన విజయం స్ఫూర్తిదాయకమని శ్రీకృష్ణచంద్ర గజపతి కళాశాల ప్రిన్సిపల్ జితేంద్ర పట్నాయిక్ అన్నారు.

• బీజేడీ శ్రేణుల ధర్నా



గుసాని గోష్టి శిక్షాధికారి కార్యాలయం ఎదుట ధర్నా జరుపుతున్న గుసాని సమితి అధ్యక్షులు వీర్రాజు, బీజేడీ పార్టీ శ్రేణులు

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో గుసాని సమితి బీఈఓ (బ్లాక్ ఎడ్యుకేషన్ అధికారి) కార్యాలయం ఎదుట బీజేడీ పార్టీ శ్రేణులు మంగళవారం ధర్నా చేశాయి. జిల్లాలో పెద్ద గుసాని ఉన్నత పాఠశాల హాస్టల్‌లో కొద్ది నెలలుగా విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన సరుకులతో పాటు ఉపాధ్యాయుల బదిలీలో అవినీతి జరుగుతోందని గుసాని సమితి అధ్యక్షుడు ఎస్.వీర్రాజు ఆరోపించారు. కలెక్టర్ పెద్ద గుసాని ఉన్నత పాఠశాల హాస్టల్‌లో విచారణ జరిపి అందుకు బాధ్యులైన హాస్టల్ సూపరింటెండెంటు, ప్రధాన శిక్షాధికారి, సమితి శిక్షాధికారిలను బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా వల్ల ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకూ బ్లాక్ అధికారి కార్యాలయం తెరవలేకపోయారు.

ఉత్సవాలకు సన్నాహక సమావేశం



సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

మల్కన్‌గిరి: జిల్లాలోని డిసెంబర్ 13 నుంచి 17వ తేదీ వరకు జరగనున్న మల్యవంత ఉత్సవాలకు సన్నాహక సమావేశం జిల్లా పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగింది. పరిషత్ అధ్యక్షురాలు సమారి తంగుల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా పరిషత వైస్ చైర్మన్ పతితపావన్ బైద్య, మల్కన్‌గిరి ఎమ్మెల్యే నరసింహ మడ్కామి, ఎంపీ ప్రతినిధి సంజయ్ సర్కార్, అటవీ శాఖ అధికారి ప్రతాప్ కొత్తపల్లి, ఏడీఎం వేదవద్ ప్రధాన్, జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహక అధికారి నరేష్ చంద్ర సబర్ తదితరులు పాల్గొన్నారు. ప్రతీ ఏడాదిలా ఈసారి కూడా మల్యవంత ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని ఏడీఎం వేదవద్ ప్రధాన్ కోరారు. పట్టణంలోని డీఏన్‌కే మైదానంలో ఈసారి ఈ ఉత్సవాలను నిర్వహించేందుకు నిర్ణయించారు.

జయపురం విమానాశ్రయంలో

త్వరలో 72 సీట్ల విమానం



జయపురం విమానాశ్రయంలో ఉడాన్ 8 వ వార్షికోత్సవం జరుపుకుంటున్న కెప్టెన్ పారిడ తదితరులు

జయపురం: జయపురం విమానాశ్రయంలో అతి త్వరలో ఏటీఆర్ 72 సీట్ల విమానం నడవనుందని విమాన విభాగ ఎయిర్‌పోర్టు డైరెక్టర్ కమాండర్ అబకాశ పారిడ వెల్లడించారు. అందుకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని, రన్‌వే విస్తరణకు సర్వే పూర్తయ్యిందని తెలిపారు. జయపురం విమానాశ్రయ అభివృద్ధి కోసం రూ.238 కోట్లు మంజూరైనట్లు వెల్లడించారు. ఉమ్మిరి ప్రాంతంలోగల జయపురం విమానాశ్రయంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన ఉడాన్ పథకం 8వ వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

డోలీ ప్రయాణం.. శిశువు మరణం



డోలి మీద గర్భిణిని తీసుకొని వెళ్తున్న దృశ్యం



ఉమ్మర్ కోట్ ఆస్పత్రిలో బాధితురాలు

కొరాపుట్: డోలీ మీద గర్భిణిని తీసుకుని వెళ్లడంతో శిశువు మృతి చెందింది. మంగళవారం నబరంగ్‌పూర్ జిల్లా బద్రపర గ్రామానికి చెందిన పరమానంద మజ్జి సతీమణి గౌతమి మజ్జికి పురిటి నొప్పులు వచ్చాయి. గ్రామానికి రోడ్డు సదుపాయం లేకపోవడంతో అంబులెన్స్ వెళ్లలేక పోయింది. దీంతో ఆమెను డోలీపై మోసుకుంటూ గుణ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో ఉమ్మర్‌కోట్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అక్కడ ప్రసవం కాగా.. శిశువు మాత్రం మరణించింది.

క్లుప్తంగా

మహాసభలను విజయవంతం చేయండి

● సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ



మహాసభల వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: విజయనగరం పట్టణంలో నవంబర్ 16,17 తేదీల్లో జరగనున్న సీపీఎం మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు, ప్రజలకు ఏవిధంగా ఉపయోగపడ్డాయి? వాటి ఫలితాలు, సీపీఎం చేసిన కృషిని మహాసభల్లో చర్చించనున్నట్లు తెలిపారు. రెండురోజుల పాటు మహాసభలు నిర్వహిస్తారన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు రెడ్డి శంకర్రావు, టీవీ రమణ, వి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర కబడ్డీ టోర్నమెంట్‌లో పతకాలు



అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు

విజయనగరం అర్బన్: ఇటీవల స్థానికంగా శ్రీ పైడితల్లి అమ్మవారి పండగ సందర్భంగా జరిగిన ఉత్తరాంధ్ర ఓపెన్ కబడ్డీ టోర్నమెంట్‌లో సత్య డిగ్రీ విద్యార్థులు ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో కళాశాల సంచాలకుడు డాక్టర్ ఎం.శశిభూషణ రావు విద్యార్థులను అభినందిస్తూ, నేటి యువత విద్యతో పాటు క్రీడలను కూడా స్ఫూర్తిగా తీసుకోవాలని పేర్కొన్నారు. బాలికలు బాలలకు దీటుగా నిలుస్తూ తమదైన శైలిలో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ ప్రసంగించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ కెప్టెన్ ఎం.సత్యవేణి, లెఫ్టినెంట్ ఉదయ్ కిరణ్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ బి.సూరప్పు నాయుడు, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ హెచ్‌హెచ్ ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంజాయితో నిందితుడి అరెస్టు



గంజాయితో పట్టుబడిన నిందితుడితో ఎస్సై దుర్గాప్రసాద్ తదితరులు

పూసపాటిరేగ: మండలంలో శుక్రవారం జరిగే సంత సమీపంలో గంజాయితో ఓ నిందితుడు పట్టుబడినట్లు ఎస్సై ఐ.దుర్గాప్రసాద్ మంగళవారం తెలియజేశారు. కందివలస గ్రామానికి చెందిన దేశెట్టి భానోజీ నుంచి 1200 గ్రాముల గంజాయితో పట్టుబడడంతో సరుకు స్వాధీనం చేసుకుని కేసునమోదు చేసినట్లు తెలిపారు. పట్టుబడిన వ్యక్తిని కోర్టుకు తరలించినట్లు చెప్పారు.

పారామెడికల్ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ వైద్య కళాశాలలో పారామెడికల్ కోర్సులో ప్రవేశాలకు ఇంటర్మీడియట్ అర్హత గల అభ్యర్థులు రూ.100 రుసుముతో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. పద్మలీల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల ను ఈనెల29వతేదీ సాయంత్రం 5 గంటల లో గా ఆఫీసు పనిదినాల్లో ప్రభుత్వ వైద్య కళాశాలలో అందజేయాలని తెలిపారు. పూర్తి వివరాల కోసం విజయనగరం. ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు. పూర్తి వివరాలు లేని దరఖాస్తులు తిరస్కరించనున్నట్లు స్పష్టం చేశారు. పోస్టు ద్వారా వచ్చే దరఖాస్తులు 29వతేదీ సాయంత్రం 5 గంటలు లోగా రావాలని, పారామెడికల్ కోర్సుల కౌన్సెలింగ్ ప్రభుత్వ వైద్య కళాశాలలో నవంబర్ 4వతేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. పారామెడికల్ కోర్సులకు ఇంటర్మీడియట్ విద్యార్హత కలిగిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, ఇంటర్మీడియట్‌లో బైపీసీ చదివిన విద్యార్థులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. తదుపరి ఎంపీసీ చదివిన విద్యార్థుకు, ఆఖరి ప్రాధాన్యం ఇతర గ్రూపుల వారికి ఇవ్వనున్నట్లు తెలియజేశారు.

మద్దతు ధరకు 'తేమతెగులు'

● ఏటా కోత వేస్తున్న మిల్లర్లు
● కీలక దశలో వరుస వర్షాలు.. నష్టపోతున్న రైతన్న
● 1,75,485 ఎకరాల్లో ఈ ఏడాది ఖరీఫ్ వరిసాగు
● 3,57,921 మెట్రిక్ టన్నుల దిగుబడి రావచ్చని అంచనా
● 2.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు కసరత్తు...



చింతాడ వద్ద తేలిక రకం వరి పంటను యంత్ర సహాయంతో కోత కోస్తున్న దృశ్యం

పాలకొండ రూరల్: ఖరీఫ్ సేద్యం దాదాపుగా చివరి దశకు చేరింది. తేలిక రకాల నుంచి దిగుబడి చేతికి వస్తున్న క్రమంలో రైతులు ఆరుగాలం సాగించిన కష్టాన్ని సొమ్ము చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. మరోవైపు ధాన్యం కొనుగోలుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఏటా ధాన్యం కొనుగోళ్ల సమయంలో రైతుల నుంచి తలెత్తుతున్న అనుమానాలకు మాత్రం అధికారుల నుంచి స్పష్టమైన సమాధానం దక్కని పరిస్థితి నెలకొంటోంది. రైతులకు క్షేత్రస్థాయిలో సేవలు అందించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పార్వతీపురం మన్యం జిల్లాలోని 15 మండలాల్లో 306 ఆర్‌బీకేలు ఏర్పాటు చేసింది. ఇక్కడి సిబ్బంది అనుక్షణం రైతుకు అండగా ఉండేవారు. ఈ కేంద్రాల ద్వారా దాదాపు ఏటా రూ.107.19 కోట్ల మేరకు 'రైతు భరోసా' పేరిట నాలుగు నియోజకవర్గాల్లో సేద్యం చేపట్టిన 1,42,930 మంది, మరో 9,256మంది కౌలు రైతుల బ్యాంక్ ఖాతాలకు నిధులు జమ అయ్యేవి. ప్రస్తుతం ఆ పరిస్థితి కనబడడం లేదు. ఈ-క్రాప్ నమోదులో తీవ్ర జాప్యం జరిగింది. ఉచిత పంటల బీమా ఊసే ఎత్తని కూటమి ప్రభుత్వం గ్రేడ్-1 రకం వరి క్వింటాకు మద్దతు ధర రూ.2,320, సాధారణ రకం క్వింటాకు మద్దతు ధర రూ.2,300 అందిస్తామని తాజాగా పేర్కొంది. ఈ క్రమంలో నిర్దేశిత మద్దతు ధర రైతుకు అందించాలంటే తేమశాతం కీలకమంటూ మిల్లర్లు మాయ చేయడం పరిపాటిగా మారింది. గ్రామస్థాయిలో రైతుసేవా (ఆర్‌బీకే) కేంద్రాలకు చెందిన అధికారులు ముందే నిర్ధారించిన తేమ శాతాన్ని పట్టించుకోకుండా మిల్లర్లు ఇష్టానుసారం తేమశాతం నిర్ధారించి మద్దతు ధరలో కోత పెడుతున్నారు. ఈ తీరును రైతులు మరిచిపోలేకపోతున్నారు. కూటమి ప్రభుత్వంలో ధాన్యంలో తేమశాతం నిర్ధారణపై ఏవిధంగా ముందుకు సాగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. రైతుసేవా కేంద్రాల అధికారులు నిర్ధారించిన తేమశాతం అంతిమమా..? లేక మిల్లర్లు నిర్ధారించిన తేమశాతాన్ని పరిగణనలోకి తీసుకుంటారా? అనే విషయంలో అధికారులు స్పష్టత ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. ప్రస్తుత ఖరీఫ్‌లో జిల్లాలో దాదాపు 1,75,485 ఎకరాల్లో రైతులు వరి పంట సాగు చేశారు. ఈ సేద్యం ప్రాప్తికి 15 మండలాల పరిధిలో 3,57,921 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వ సూచనలతో జిల్లా పరిధిలో రైతులు పండించిన పంటలో 2.70 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించిన కసరత్తు ప్రారంభించిన అధికారులు 183 కేంద్రాల ద్వారా కొనుగోలు చేయదలిచారు. 93 మిల్లులను ఇందు కోసం గుర్తించారు. ప్రస్తుత ఖరీఫ్‌లో రైతులు ఎన్నో



పాలకొండలో కోతలు పూర్తి చేసిన వరి దిగుబడిని బస్తాలకు ఎత్తుతున్న రైతులు

ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొని పంట సాగు చేశారు. టీడీపీ కూటమి ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆర్థిక సాయం అందక పోవడంతో అప్పులు చేసి మదుపులు పెట్టారు. భారీ వర్షాలకు నాట్లు, నారు మడులు దెబ్బతినడంతో అదనపు పెట్టుబడులు పెట్టాల్సి వచ్చింది. తాజాగా బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో మరో మూడు రోజులు వర్షాలు పడే అవకాశాలు ఉన్నట్లు తెలుసుకుని ఆందోళన చెందుతున్నారు.

మిల్లర్ల మాయాజాలం సహించం



అన్నదాత కష్టం దోచుకోవాలని మిల్లర్లు భావిస్తే సహించం. రైతుసేవా కేంద్రాల సిబ్బంది నిర్ధారించిన తేమశాతం ప్రకారమే ధాన్యం తీసుకోవాలి. ధాన్యం కొనుగోలులో తేమశాతం పేరుతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అధికారులు నిర్ధారించిన తేమశాతాన్ని మిల్లర్లు పరిగణనలోకి తీసుకోవడం లేదు. రైతులకు అందించాల్సిన మద్దతు ధరలో కోత పెడుతున్నారు. మిల్లర్ల మాయాజాలంతో రైతు నష్టపోకుండా స్పష్టమైన విధివిధానాలను అధికారులు ఖరారు చేయాలి. ఇప్పటికే రైతులు అధిక మదుపులు పెట్టి ఇబ్బందులు పడుతున్నారు. **బుడితి అప్పలనాయుడు, ఏపీ రైతు సఘం జిల్లా ప్రధాన కార్యదర్శి**

విద్యాా వ్యతిరేక విధానాలు తిప్పికొట్టాలి

● ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు
● ముగిసిన ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రథమ మహాసభ



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్ బాబు

పార్వతీపురంటౌన్: రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్ బాబు అన్నారు. ఈ మేరకు పార్వతీపురం పట్టణంలోని ఎన్‌జీఓ హోంలో మంగళవారం జరిగిన ఏఐఎస్ఎఫ్ పార్వతీపురం మన్యం జిల్లా ప్రథమ మహాసభల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై గల్లీ నుంచి ఢిల్లీ వరకు పోరాటం చేస్తున్న ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని అన్నారు. భవిష్యత్ పోరాటాలకు విద్యార్థులను ఏకం చేసి పోరాటాలు నిర్వహించాలని కోరారు. విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటాలకు శ్రీకారం చుడతామని, విద్యార్థులకు ఏ సమస్య వచ్చినా ఏఐఎస్ఎఫ్ తోడుగా ఉంటుందని భరోసా ఇచ్చారు. భవిష్యత్తులో జరగబోయే పోరాటాలకు విద్యార్థులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

నూతన జిల్లా సమితి ఎన్నిక

ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి అధ్యక్ష కార్యదర్శులుగా ఎం.భీమరాజ్ బి.రవికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారితో పాటు 17 మంది సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులకు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్.నాగభూషణ్, సీపీఐ జిల్లా కార్యదర్శి మన్మథ రావు, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు రవికుమార్, ఏఐవైఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు గోపినాయుడు, బీటీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విద్యుత్ ఉద్యోగుల సత్తా

● క్రీడాకారులను అభినందించిన ఎస్ఈ లక్ష్మణరావు



బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలను అభినందిస్తున్న ఎస్ఈ లక్ష్మణరావు

విజయనగరం: షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విజయనగరం ఏపీఈపీడీసీఎల్ అపరేషన్ సర్కిల్ నుంచి ప్రాతినిధ్యం వహించిన విద్యుత్ ఉద్యోగులు సత్తా చాటారు. ఇటీవల నెల్లూరు జిల్లాలో జరిగిన ఇంటర్ సర్కిల్ టోర్నమెంట్‌లో విజయనగరం నుంచి ప్రాతినిధ్యం వహించిన పి.పైడిరాజు, గిరి, బి.సింహాచలం, వై.ఓంకార్, బి.లోకేష్‌ల బృందం ద్వితీయస్థానం దక్కించుకుంది. ఈ మేరకు మంగళవారం సర్కిల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఉద్యోగులను ఎస్ఈ మువ్వల లక్ష్మణరావు, స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రెసిడెంట్ పి.త్రినాథరావు, ప్రధాన కార్యదర్శి వి.రాంబాబులు అభినందించారు. ఈ సందర్భంగా ఎస్ఈ లక్ష్మణరావు మాట్లాడుతూ ఉద్యోగులు క్రీడల్లో రాణించడం ద్వారా ఒత్తిడి తగ్గి ఆరోగ్యకరమైన జీవనం సాగించవచ్చని హితవు పలికారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించి ఏపీఈపీడీసీఈఎల్ విజయనగరం ఆపరేషన్ సర్కిల్‌కు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

వలంటీర్లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న వలంటీర్లు, ఏఐటీయూసీ నాయకులు

పార్వతీపురం టౌన్: తక్షణమే వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఆర్‌వీఎస్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వలంటీర్లతో కలిసి మంగళవారం పార్వతీపురం పట్టణంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లు ప్రజలకు సేవలు అందించిన నిరుద్యోగ యువతీ యువకులను కూటమి ప్రభుత్వం రోడ్డున పడేయడం సరైన పద్ధతి కాదని మండిపడ్డారు. గతంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా రూ.10వేలు గౌరవ వేతనం ఇస్తూ ఉద్యోగాన్ని కొనసాగిస్తామని వారిలో ఆశలు కలిగించారని, ఇప్పటికి ఐదు మాసాలు గడిచి సుమారు 17 క్యాబినెట్ సమావేశాలు నిర్వహించినా ఒక సమావేశంలో కూడా వలంటీర్ల ప్రస్తావన జరగలేదన్నారు. వలంటీర్లకు బకాయి ఉన్న ఐదు నెలల గౌరవ వేతనాన్ని చెల్లించి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కరోనా లాంటి కష్ట పరిస్థితుల్లో సేవలందించిన వలంటీర్లపై మానవతా దక్పథంతో ఆలోచించి వారిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. వలంటీర్లకు మళ్లీ ఉద్యోగం ఇచ్చేంతవరకు నిరసన తెలుపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు వలంటీర్లు పాల్గొన్నారు.

చిన్నయ్యపేట గ్రామస్తులతో ఫ్యాక్టరీ యాజమాన్యం చర్చలు

రేగిడి: మండలంలోని చిన్నయ్యపేట గ్రామస్తులతో సంకిలి ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారం యాజమాన్యం చర్చలు జరిపింది. ఈ ఫ్యాక్టరీ వల్ల తమ గ్రామం మొత్తం నష్టపోతుందని గ్రామస్తులు ఈనెల 21 న ఫ్యాక్టరీ ఎదుట ధర్నాచేశారు. ఈమేరకు స్పందించిన ఫ్యాక్టరీ యాజమాన్యం ప్రతినిధులు అసోసియేటివ్ వైస్ ప్రెసిడెంట్ పట్టాభిరావిరెడ్డి, కేన్ డీజీఎం రమేష్ తదితరులు చిన్నయ్యపేట గ్రామానికి మంగళవారం చేరుకుని, పెద్దలతో పాటు యువతను కూర్చోబెట్టి సమస్యలు తెలుసుకున్నారు. గ్రామానికి తాగునీటి వాటర్ ప్లాంట్ ఏర్పాటుచేస్తామని, ప్రతి నెలా వైద్య శిబిరం నిర్వహించి, ఉచితంగా మందులు ఇస్తామని, సాగునీటి చెరువులకు ఇబ్బందులు లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. వారం రోజుల్లో వాటిని ప్రారంభిస్తామన్నారు. ఇదిలా ఉండగా తమ గ్రామంలోకి ఫ్యాక్టరీ కాలుష్యం రాకుండా చూడాలని గ్రామస్తులు కోరారు.

విద్యార్థి దశ నుంచే అవగాహన అవసరం

● ఏపీఎస్‌పీ కమాండెంట్ మల్లికా గార్గ్



విద్యార్థులు తిలకిస్తున్న పోలీస్ హౌస్‌ను పరిశీలిస్తున్న బెటాలియన్ కమాండెంట్ మల్లికా గార్గ్

డెంకాడ: సమాజంలోని వివిధ అంశాలపై విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకోవడం ద్వారా భవిష్యత్‌లో మంచి ప్రయోజనం ఉంటుందని చింతలవలస ఐదవ ఏపీఎస్‌పీ బెటాలియన్ కమాండెంట్ మల్లికా గార్గ్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని బెటాలియన్‌లోని యూనియన్ ఫంక్షన్ హాల్ ఆవరణలో మంగళవారం పోలీస్ హౌస్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రదర్శించిన ఆయుధాల పనితీరును విద్యార్థులకు ఆమె వివరించారు. ఈ సందర్భంగా ఎస్‌డీఆర్ఎఫ్ డిమానిస్ట్రేషన్‌ను విద్యార్థులు తిలకించారు. బెటాలియన్‌లో ఉన్న పాఠశాలతో పాటు వివిధ పాఠశాలల నుంచి వచ్చిన వందలాది మంది విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కమాండెంట్ మల్లికా గార్గ్ మాట్లాడుతూ పోలీస్ ఆయుధాల పనితీరు, ఇతరఅంశాలపై విద్యార్థులు తెలుసుకోవడం ద్వారా అవగాహన పెంచుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో 1వ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ పి.సత్తిబాబు, బెటాలియన్ ఇన్‌చార్జ్ అడిషనల్ కమాండెంట్ జీవీ ప్రభాకరరావు,అసిస్టెంట్ కమాండెంట్లు ఎస్.బాపూజీ, ఆర్ఐలు, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం లభ్యం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పూసపాటిరేగ: మండలంలోని చింతపల్లితీరంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో చింతపల్లిబీచ్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఒడ్డుకు కొట్టుకుని వచ్చిందని సమాచారం అందడంతో వెళ్లి పరిశీలించిన పోలీసులు మృతుడి వయస్సు సుమారు 45 సంవత్సరాలు ఉండవచ్చని తెలియజేశారు. మృతుడి వివరాలు తెలిసినవారు పూసపాటిరేగ ఎస్సై ఫోన్ 912110 9447 నంబర్‌కు తెలియచేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి..



ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తి

పూసపాటిరేగ (భోగాపురం): భోగాపురం మండలం సుందరపేట ఫ్లైఓవర్ వద్ద జరిగిన ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మంగళవారం మృతిచెందాడు. విశాఖ నుంచి శ్రీకాకుళం వైపు పల్సర్‌బైక్‌పై వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తి డివైడర్‌ను బలంగా ఢీకొనడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం విజయనగరం కేంద్రాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు భోగాపురం పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

28న విద్యార్థులకు వ్యాసరచన, వ్యకృత్వ పోటీలు

విజయనగరం టౌన్: మహాకవి గురజాడ వర్ధంతిని పురస్కరించుకుని గురజాడ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 28న సోమవారం ఉదయం 9.30 గంటలకు గురజాడ జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆవరణలో పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం పోటీలను నిర్వహిస్తున్నట్లు సమాఖ్య ప్రధాన కార్యదర్శి కాపుగంటి ప్రకాశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతి నుంచి పదోతరగతి వరకూ వక్తృత్వ పోటీలో గురజాడ కన్యాశుల్కం, నాటి సామాజిక పరిస్థితులు అనే అంశంపై గంట నిడివిలో మాట్లాడాల్సి ఉంటుందన్నారు. గురజాడ దేశభక్తి అంశంపై 6,7 తరగతి విద్యార్థులకు, 8,9,10 తరగతి విద్యార్థులకు గురజాడ సాహిత్యంలో మహిళ అనే అంశంపై వ్యాసరచన నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. విజేతలకు నవంబర్ 30న సాయంత్రం గురజాడ విశిష్ట పురస్కార ప్రదానోత్సవ సభలో బహుమతి ప్రదానం చేయనున్నట్లు స్పష్టం చేశారు. వివరాలకు ఫోన్ 9912764646, 8374449526, 9440 117116 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వసతిగృహాల్లో సమస్యల తిష్ఠ



విద్యార్థులు పారబోసిన ఆహారాన్ని తింటున్న వీధి కుక్కలు



గిరిజన సంక్షేమ వసతి గృహం పార్వతీపురం



పారిశుధ్యం లేని మరుగుదొడ్లు



వసతి లేని వసతి గృహగదులు

పార్వతీపురంటౌన్: జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులు సమస్యలతో సతమవుతున్నారు. తాగడానికి, వినియోగానికి నీరు, ఉండడానికి సరిపడ గదులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హాస్టల్స్‌లో విద్యార్థులకు సరిపడా గదులు, మరుగుదొడ్లు లేవు. ఒక్కో గదిలో దాదాపు 15 నుంచి 20 మంది వరకూ ఉండాల్సిన దుస్థితి నెలకొంది. కొంతమంది గదుల్లో ఉంటే మరి కొంతమంది విద్యార్థులు బయట ఉండాల్సి వస్తోంది. జిల్లాలో సాంఘిక సంక్షేమ, బీసీ, గిరిజన సంక్షేమ శాఖ వసతి గృహాలు మొత్తం 450 ఉన్నాయి. వాటిలో 25,410 మంది విద్యార్థులు ఉన్నారు. కొన్ని వసతి గృహాల్లో విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు లేకపోవడంతో కాలకృత్యాలు తీర్చుకోవడానికి బయటకు పరిగెత్తాల్సిన పరిస్థితి దాపురించింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వసతి గృహాల్లో సమస్యలు వెక్కిరిస్తున్నాయి. హాస్టల్స్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.

గత ప్రభుత్వంలో మౌలిక సదుపాయాలకు పెద్దపీట

గత ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు, వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేశారు. వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించేందుకు చర్యలు తీసుకున్నారు. అలాగే వసతి గృహాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించారు. దీంతో వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థుల చదువులు సాఫీగా సాగాయి.

అద్దె చెల్లిస్తున్నా వసతులు శూన్యం

జిల్లాలోని కొన్ని వసతి గృహాలకు ప్రభుత్వ భవనాలు లేకపోవడంతో ప్రైవేట్ బిల్డింగ్‌లు అద్దెకు తీసుకున్నారు. ఒక్కోవసతి గృహానికి నెలకు రూ.40వేల నుంచి రూ.50 వేలు ప్రభుత్వం అద్దె చెల్లిస్తున్నప్పటికీ సరైన వసతులు మాత్రం లేవు. గదులకు తలుపులు, కిటికీలు కూడా లేవు. దోమల బెడదతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిళ్లు అయితే జాగారం చేయాల్సిన పరిస్థితి నెలకొందని విద్యార్థులు వాపోతున్నారు. ప్రభుత్వం నుంచి ప్రతి నెలా అద్దె చెల్లిస్తున్నప్పటికీ భవన యజమానితో మరమ్మతులు చేయించాల్సిన బాధ్యత వార్డెన్లపై ఉంది. అయితే వార్డెన్లు ఇవేమీ పట్టించుకోవడం లేదు.

పర్యవేక్షణ శూన్యం

వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందేలా చూడాల్సిన బాధ్యత సంబంధిత శాఖల డైరెక్టర్, సహాయ సంక్షేమ అధికారులపై ఉంది. అయితే అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కొన్ని వసతి గృహాల్లో సిబ్బంది కొరత

150 మంది విద్యార్థులు ఉన్న వసతి గృహంలో 3 నుంచి 4 మంది వర్కర్లు పని చేయాల్సి ఉంది. అయితే జిల్లాలోని కొన్ని వసతి గృహాల్లో ఒక్క వర్కర్‌తో మాత్రమే అన్ని పనులు చేయిస్తున్నారు. వర్కర్ ఒక్కరే ఉండడంతో విద్యార్థులు భోజనం కూడా సరిగా చేయలేని పరిస్థితి నెలకొంది. ఉడికీ ఉడకని అన్నం, కూరలు పెడుతుండడంతో విద్యార్థులు భోజనం తినలేక బయట పడేస్తున్నారు. వర్కర్ ఒక్కరే అన్ని పనులు చేయలేకపోతుండడంతో విద్యార్థులతో వంటపనితో పాటు ఇతర పనులు చేయిస్తున్నారు.

సౌకర్యాలు కల్పించాలి



వసతిగృహాల్లో సౌకర్యాలు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని వసతిగృహాల్లో మరుగుదొడ్లకు తలుపులు లేకపోవడం, మరికొన్ని వసతిగృహాల్లో భోజన సౌకర్యం సరిగ్గా లేకపోవడం వంటి సమస్యలు ఉన్నాయి. ఒక్కో గదిలో 20మందికి పైగా విద్యార్థులు ఉంటున్నారు. ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించి వసతిగృహాలకు మరమ్మతులు చేపట్టాలి.

– పి.రాజశేఖర్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయకార్యదర్శి, పార్వతీపురం

డయేరియా విజృంభణకు... బాధ్యులెవరు?

సాక్షి ప్రతినిధి, విజయనగరం: డయేరియాతో పదకొండు మంది, వేర్వేరు ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ డయేరియా సోకి మరోఐదుగురు మృతి చెందిన ఘటనలో బాధ్యులెవరో తేల్చేందుకు సీనియర్ ఐఏఎస్ అధికారి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ రంగంలోకి దిగారు. డయేరియాతో 11 మంది చనిపోవడం, వ్యాధిగ్రస్తులను స్థానిక హైస్కూల్‌లోని వైద్యశిబిరంలో పిల్లల బెంచీలపై పడుకోబెట్టి వైద్యం చేయడాన్ని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రశ్నించిన సంగతి తెలిసిందే. దీంతో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సోమవారం గుర్లలో పర్యటించి వెళ్లారు. డయేరియాకు కారణాలు, తదుపరి పరిణామాలపై విచారణ జరిపేందుకు ప్రభుత్వం కె.విజయానంద్‌ను విచారణాధికారిగా నియమించింది. ఆయన మంగళవారం ఉదయం విజయనగరం కలెక్టరేట్‌కు వచ్చారు. తొలుత కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్, గ్రామీణ నీటిసరఫరా విభాగం చీఫ్ ఇంజినీర్ నాయక్, తదితర అధికారులతో మాట్లాడారు. గుర్ల మండలంలో తాగునీరు కలుషితమయ్యేందుకు కారణాలు, ప్రభావిత గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితులు, డయేరియా రోగులకు అందించిన వైద్య సేవలు, తదితర అంశాలపై ఆరా తీశారు. తదుపరి పంచాయతీరాజ్, గ్రామీణ నీటిసరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్), వైద్య ఆరోగ్య శాఖల అధికారులు, ఉద్యోగులను ప్రశ్నించారు. డయేరియా కేసులు వెలుగులోకి వచ్చిన వెంటనే ముఖ్యంగా వైద్య ఆరోగ్యశాఖ ఏవిధంగా స్పందించినది సవివరంగా ఆరా తీశారు. మొదటి కేసు ఎప్పుడు నమోదైంది, ఎంత వ్యవధిలో ఆ రోగికి వైద్యసేవలు అందించారన్న అంశాలను ప్రశ్నించారు.

'కలుషితం' కారణాలపై దృష్టి...

తాగునీరు కలుషితమవడానికి కారణాలు, ల్యాబ్ రిపోర్టులపై విజయానంద్ ఆరా తీశారు. తాగునీటి నాణ్యతపై జరిపించిన ల్యాబ్ టెస్టుల్లో డయేరియా కారకమైన బ్యాక్టీరియా ఉందని తేలినట్లు డీఎంహెచ్ఓ భాస్కరరావు వెల్లడించారు. ఈ నెలలో వర్షపాతం వివరాలను తహసీల్దార్ ఆదిలక్ష్మి తెలియజేశారు. ఎస్ఎస్ఆర్ పేట తాగునీటి పథకం నుంచి సరఫరా అయిన నీరు ఏమైనా కలుషితమయ్యిందా? అని విజయానంద్ ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఉమాశంకర్‌ను అడిగారు. పైపులైన్ల లీకేజీల వల్ల కూడా నీరు కలుషితమవ్వవచ్చని, ప్రస్తుతం డ్రెయిన్లలో ఉన్న పైపులైన్లను తొలగించి కొత్తవాటిని వేయాల్సి ఉందని ఎస్ఈ చెప్పారు. ఓవర్‌హెడ్ ట్యాంకులను ఎన్ని రోజులకు శుభ్రం చేస్తున్నారని విజయానంద్ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ప్రశ్నించారు. గుర్ల గ్రామంలో బహిరంగ మలవిసర్జన చేస్తున్నారనే విషయంపై ఆయన స్పందిస్తూ, అసలు గ్రామంలో వ్యక్తిగత మరుగుదొడ్లు లేని కుటుంబాలు ఎన్ని ఉన్నాయని అడిగారు. గ్రామంలోని 918 కుటుంబాలకు 180 కుటుంబాలకు మరుగుదొడ్లు లేవని, ఉన్న మరుగుదొడ్లను కొంతమంది ఇతర అవసరాలకు వాడుకుంటున్నారని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు చెప్పారు. డయేరియా ప్రభావిత గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ తీరు ఎలా ఉందనేదీ డివిజనల్ పంచాయతీ అధికారి మోహన్‌రావును, గ్రామ పంచాయతీ కార్యదర్శులను విజయానంద్ ప్రశ్నించారు.

పునరావృతం కాకూడదు

గుర్లలో మాదిరి డయేరియా ఘటనలు పునరావృతం కాకుండా చేపట్టాల్సిన చర్యలేమిటో నివేదిక ఇవ్వాలని డీఎంహెచ్ఓ భాస్కరరావును విజయానంద్ ఆదేశించారు. డయేరియా ప్రబలిన తీరుపై చీపురుపల్లి ఆర్డీఓ సత్యవాణితో మాట్లాడారు. తదుపరి గుర్ల మండలంలో పర్యటించారు.